జోరుగా నగర వనాల నిర్మాణం

- పెనుకొండ, బుక్కపట్నం ప్రాంతాల్లో రూ.రెండు కోట్లతో పనులు
- ప్రతిచోట వాకింగ్ ట్రాక్, ట్రెక్కింగ్ నడుపాయం, ఓపెన్ జిమ్
- తుది దశకు నిర్మాణ పనులు

పెనుకొండ రూరల్: రాష్ట్రంలో ప్రజలకు ఆహ్లాదం, ఆరోగ్యం, పచ్చదనం పెంపొందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోంది. ఇందులో భాగంగానే నగర వనాలను ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగానే జిల్లాలోని పెనుకొండ, బుక్కపట్నం ప్రాంతాల్లో నగర వనాలను శరవేగంగా నిర్మిస్తున్నారు. బుక్కపట్నం మండలం అమగొండపాళ్యంలోని చన్నారాయుని స్వామి దేవాలయం సమీపంలో, పెనుకొండ 44వ జాతీయ రహదారి పూలేకమ్మ దేవాలయం ఎదురుగా 50 హెక్టార్లలో నగర వన పనులు జరుగుతున్నాయి. దాదాపు రూ.రెండు కోట్ల రూపాయలతో అందంగా వీటిని తీర్చిదిద్దుతున్నారు.

నగర వనం ఇలా..

నగర వనంలో చిన్న పిల్లల ఆటవస్తువులతో పాటు ఓపెన్ జిమ్, ఓపెన్ థియేటర్, ఫంక్షన్ హాల్ , వాకింగ్ పార్క్, జాగింగ్ ట్రాక్, ట్రెక్కింగ్, యోగా, విద్యార్థుకు పర్యావరణ విద్యపై అవగాహన కల్పించేలా ఏర్పాట్లు, బొటానికల్ ప్లాంట్ వంటివి ఏర్పాటు చేయనున్నారు.


పెనుకొండ: పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట వస్తువులు


పెనుకొండ: నిర్మాణంలో ఉన్న జాగింగ్ ట్రాక్

ఫిబ్రవరిలో ప్రారంభిస్తాం



నగర వనం ఏర్పాటులో స్వచ్ఛంద సంస్థలు, ప్రజాభిప్రాయాలను స్వీకరిస్తున్నాం. దాతల సహకరిస్తే వారి పేరు మీదగా నమునాలు ఏర్పాటు చేస్తాం. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నగర వనాలను ప్రారంభిస్తాం. పెనుకొండ కొండపై కూడా మరో నగర వనాన్ని నిర్మించేందకు ప్రతిపాదనలు పంపాము.

– రవీంద్రనాథ్‌రెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి

నగర వనం ఏర్పాటు హర్షణీయం



పెనుకొండ సమీపంలోనే నగర వనాన్ని నిర్మిస్తుండటం హర్షణీయం. నేటి కాలంలో ప్రతి ఒక్కరికీ వ్యాయామం తప్పనిసరి. పార్కులో వాకింగ్, జాగింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేస్తుండటంతో అందరికీ ఉపయోగపడుతుంది. పార్కులో బొటానికల్ ప్లాంట్‌ను కూడా నిర్మిస్తుండటంతో విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం.

– నాగార్జునుడు, ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం, గుట్టూరు

సంక్షేమానికి సీఎం జగన్ పెద్దపీట


బ్రహ్మేశ్వరంపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక

చిలమత్తూరు: పేద ప్రజల సంక్షేమానికి సీఎం జగన్ పెద్దపీట వేశారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని దేమకేతేపల్లి పంచాయతీలోని బ్రహ్మేశ్వరంపల్లి, వై గొల్లపల్లి, యగ్నిశెట్టిపల్లి గ్రామాల్లో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు చేకూరిన సంక్షేమ లబ్ధిని వివరించారు. దీపిక మాట్లాడుతూ సీఎం జగన్ ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. పేదలను ఆర్థికంగా బలోపేతం చేస్తుంటే నగదు వేస్తూ ప్రజలను సోమరులుగా చేస్తున్నారని టీడీపీ నాయకులు విమర్శిస్తుండటం సరికాదన్నారు. ఇలాంటి వారు మరోసారి అబద్ధపు హామీలతో మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మీ కుటుంబాలకు మంచి జరిగి ఉంటేనే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పురుషోత్తమరెడ్డి , తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ నరేష్‌కృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ తిరుమలేష్, ఎంపీటీసీ రాఘవేంద్రరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ దివాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శంకర్‌రెడ్డి, నాయకులు లక్ష్మిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, నాగరాజు, బాబేనాయక్, షాకీర్, హరి, రవీంద్రరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డి పర్యటన విజయవంతం చేద్దాం

హిందూపురం: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా అందరూ కలిసి కట్టుగా పనిచేద్దామని వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎంపీ రెడ్డప్ప, టీటీడీ బోర్డు మెంబర్ పోకల అశోక్ కుమార్, హిందూపురం నియోజకవర్గ పరిశీలకులు రెడ్డిఈశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటనను విజయవంతం చేసేందుకు శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి అధ్యక్షతన హిందూపురం , లేపాక్షి మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జనవరి 8 నుంచి నాలుగు రోజులపాటు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజకవర్గంలో పర్యటిస్తారన్నారు. పార్టీ గెలుపులోనే భవిష్యత్తు ఉంటుందని, ప్రతి ఒక్కరూ దీన్ని గ్రహించి పనిచేయాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో పురంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి చరిత్రను తిరగరాయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొండవీటి నాగభూషణం, కృష్ణమూర్తి, ఎంబీ కుమార్, జింకా చలపతి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యక్తిగత సహాయకులు చంద్రహాస్, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు మధుమతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశమైన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు

క్యాలెండర్ల ఆవిష్కరణ

రొళ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం నూతన సంవత్సర ఏపీటీఎఫ్ క్యాలెండర్లను, డీటీఎఫ్ డైరీని ఎంఈఓ శ్రీధర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యంజారప్ప, మండల శాఖ అధ్యక్షుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: నూతన సంవత్సర క్యాలెండర్లను శుక్రవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. ఎంఈఓలు చంద్రశేఖర్, సుధాకర్, హెచ్‌ఎం జ్యోతిలత, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కోడూరు శ్రీనివాసులు, జిల్లా ఆడిట్ కోకన్వీనర్ కరణం రఘునాథరావు, మండలశాఖ అధ్యక్షుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో...

పట్టణంలోని ఎంఆర్‌సీలో యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, నారాయణస్వామి, నబీ, తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం యూటీఎఫ్‌కు సంబంధించిన క్యాలెండర్, డైరీలను ఎంఈఓలు ఆంజినేయులు నాయక్, ఆనంద్‌బాబు ఆవిష్కరించారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు అశ్వర్థప్ప, ప్రధాన కార్యదర్శి లక్ష్మా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: స్థానిక కేజీబీవీ పాఠశాల ఆవరణలో శుక్రవారం ఏపీటీఎఫ్ నూతన క్యాలెండ్, డైరీని ఎంఈఓలు ఆంజనేయులునాయక్, జయభాస్కర్ ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్, మండలాధ్యక్షుడు గంగాధర్, ప్రధాన కార్యదర్శి మారుతి, మహిళా అధ్యక్షురాలు హేమ తదితరులు పాల్గొన్నారు.


రొద్దంలో యూటీఎఫ్ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

స్వార్థ ప్రయోజనాల కోసమే తప్పుడు ప్రచారం

చిలమత్తూరు: 'వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసి సమన్వయంతో పనిచేస్తున్నాం. పార్టీలో గ్రూపులకు తావులేదు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు'. అని ఎంపీపీ పురుషోత్తమరెడ్డి అన్నారు. మండల నాయకులతో కలిసి శుక్రవారం బ్రహ్మేశ్వరంపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీలో నాయకులు గ్రూపులుగా ఏర్పడ్డారన్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. చిలమత్తూరు ఎంపీటీసీ రాఘవేంద్రరెడ్డి, బాబేనాయక్, చిలమత్తూరు సర్పంచ్ సంధ్య మాట్లాడుతూ కొందరు స్వార్థ ప్రయోజనాల కోసమే గ్రూపులంటూ ప్రచారం చేస్తున్నారన్నారు. తాను టీడీపీలోకి వెళుతున్నట్లు జరుగుతున్న ప్రచారంలో నిజంలేదని దేమకేతేపల్లి సర్పంచ్ తిరుమలేష్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు వీరన్న, లక్ష్మిరెడ్డి, దివాకర్‌రెడ్డి, హరి, నాగభూషన్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బాల్య వివాహాలపై అవగాహన

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మహిళా శిశు సంక్షేమ శాఖ, ఆర్డీటీ ఆధ్వర్యలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డీ మల్లికార్జున పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీటీ టీమ్ లీడర్ అదినారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లీలావతి, శంకరమ్మ, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రమేష్, పాల్గొన్నారు.

అభివృద్ధిపై దృష్టి సారించండి

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలను పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ కౌన్సిల్ మీట్ జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఆయా వార్డుల్లో సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని కోరారు. అనంతరం కౌన్సిలర్లు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, కమిషనర్ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

హిందూపురం: హోటల్స్ నిర్వాహకులు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు శానిటేషన్ నిర్వాహణపై దృష్టిసారించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక రహమత్‌పురంలోని హోటల్స్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోటల్స్ వద్ద మురుగు కాల్వల్లో చెత్తా చెదారం పడేస్తే చర్యలు తప్పవన్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'

రొద్దం: మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. క్రికెట్, బ్యాడ్మింటన్ తదితర క్రీడా పోటీలను నిర్వహించినట్లు ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ తెలిపారు. రొద్దం కార్యక్రమంలో తహసీల్దార్ అనంతచారి, రొద్దం సచివాలయం-3 పంచాయతీ కార్యదర్శి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న ' ఆడుదాం ఆంధ్రా' క్రీడాపోటీలు కోడూరు, దేమకేతేపల్లిలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. కోడూరులో సర్పంచ్ మురళీమోహన్, సింగిల్‌విండో చైర్మన్ హనుమంతరెడ్డి, ఎంపీటీసీ మంజునాథ్‌రెడ్డి, ఆదినారాయణలు తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: మండల వ్యాప్తంగా వివిధ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాల్లో శుక్రవారం కూడా ఆడుదాం ఆంధ్రా పోటీలు జరిగాయి. ఎంఈఓ శ్రీధర్, పీఈటీ మోహన్ పోటీలను పర్యవేక్షించారు. క్రికెట్, వాలీబాల్, ఖోఖోతో పాటు కబడ్డీ ఇతరాత్ర పోటీలు జరుగుతున్నాయన్నారు.


చిలమత్తూరు మండలం కోడూరులో క్రీడాకారులకు కిట్లను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

పెనుకొండ రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో యువత క్రీడానైపుణ్యాన్ని వెలికి తీసేందుకే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మండలంలోని ఎర్రమంచి, గుట్టూరు, అడదాకులపల్లిలో శుక్రవారం క్రికెట్, కబడ్డీ పోటీలను నిర్వహించారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని మెళవాయి, ఛత్రం, గుండుమల, కల్లుమర్రి గ్రామ సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు శుక్రవారం ఎంతో ఉత్సాహంగా జరిగాయి. కార్యక్రమంలో సర్పంచులు రంగనాథ్, చెన్నయ్య, ఎంపీటీసీలు గంగరత్నమ్మ, హనుమంతరాయప్ప క్రీడాకారులు పాల్గొన్నారు.

అగళి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాలీబాల్, ఖోఖో పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఎంపీడీఓ రవిప్రసాద్ మాట్లాడుతూ అగళి, మధుడి పాఠశాలలు క్రీడా పోటీల్లో ముందంజలో ఉన్నట్లు పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి రంగనాథ్, సర్పంచ్ లక్ష్మమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


రొద్దం: వాలీబాల్ ఆడుతున్న యువకులు


మడకశిర మండలం కల్లుమర్రిలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

బోధనా పద్ధతులు మెరుగు పర్చుకోండి

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు బోధనా పద్ధతులు మెరుగు పర్చుకుని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రొళ్ల, అగళి మండలాల్లోని వివిధ ఉన్నత పాఠశాలలో గణితం, సైన్స్, సోషియల్ సబ్జెక్టులు బోధిస్తున్న ఉపాధ్యాయులతో పాటు రత్నగిరి కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు ఆలుపనపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ఎంఈఓ శ్రీధర్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు బోధించాలని సూచించారు. అదే విధంగా పాఠశాల అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీకి రూ.4 లక్షల ఆదాయం

మడకశిర: మండలంలోని భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లేడుగుంట ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల ద్వారా ఆర్టీసీకి రూ.4.02 లక్షల ఆదాయం వచ్చినట్లు డీఎం రామసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బ్రహ్మరథోత్సవం, జ్యోతులు, భూతప్పల ఉత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడిపామని పేర్కొన్నారు. ఆశించిన స్థాయిలో సంస్థకు ఆదాయం వచ్చిందన్నారు.

కూలీల సంఖ్య పెంచండి


మాట్లాడుతున్న జేఈ జగదీష్

అమరాపురం: ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఆ శాఖ జేఈ జగదీష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఉపాధి మేట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామంలోనూ మేట్లు ఆయా కుటుంబాల వద్దకు వెళ్లి సమన్వయ పరచి కూలీ పనులకు వచ్చేలా చూడాలన్నారు. ప్రతి కూలీకి పని కల్పిస్తామన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం


డ్రైనేజ్ నిర్మాణ పనులు చేపట్టిన దృశ్యం

అగళి: మండల పరిధిలోని రామపురం గ్రామంలో రూ.3.50 లక్షలతో డ్రైనేజ్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినట్లు సర్పంచ్ లక్ష్మమ్మ తెలిపారు. డ్రైనేజ్, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామన్ని గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు ఎమ్మెల్యే తిప్పేస్వామికి విన్నవించారు. దీంతో రూ.20 లక్షల నిధులు మంజూరు చేయించారన్నారు. రూ.3.50 లక్షలతో డ్రైనేజ్ పనులు, రూ.13 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ


భూమి పూజలో పాల్గొన్న దళిత నాయకులు

అమరాపురం: మండల కేంద్రంలోని మడకశిర రోడ్డులో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, ఆర్డీటీ సంస్థ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగానే శుక్రవారం అమరాపురం అంబేడ్కర్ సంఘం సభ్యులు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన దళిత సోదరులు పాల్గొన్నారు.

నేడు లేపాక్షికి మధ్యప్రదేశ్ హైకోర్టు జస్టిస్ రాక

లేపాక్షి: మధ్యప్రదేశ్ హైకోర్టు జస్టిస్ దినేష్ కుమార్ పలివాల్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం లేపాక్షి వీరభద్రస్వామి ఆలయాన్ని సందర్శించనున్నట్లు తహసీల్దార్ బాబు తెలిపారు. ప్రత్యేక పూజల్లో వారు పాల్గొంటారన్నారు.

3 నుంచి ఆరోగ్య సురక్ష క్యాంపులు

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలో జనవరి 3 నుంచి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ ప్రభాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 3, 10, 24, 31 తేదీల్లో, అలాగే ఫిబ్రవరి 7, 14 తేదీల్లో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు జరుగుతాయన్నారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం


అలంకరణలో కంబాల నరసింహస్వామి

మడకశిరరూరల్: మండలంలోని భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి ,జిల్లెడుగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం జిల్లెడుగుంట ఆంజనేయస్వామి దేవాలయం నుంచి కంబాల నరసింహస్వామి దేవాలయానికి ఉత్సవమూర్తులను తీసుకెళ్లి జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. అలాగే భక్తరపల్లిలో లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శయనోత్సవం నిర్వహించారు.

రికార్డుల పరిశీలన

అగళి: స్థానిక మోడల్ స్కూల్‌లో ఎస్ఆర్పీ కాంతయ్య ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ బృందం రికార్డులను తనిఖీ చేసింది. చిక్కీలు, ఎగ్స్, విద్యార్థుల హాజరు, మధ్యాహ్నం భోజనం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఆర్పీ కాంతయ్య మాట్లాడుతూ.. మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజనాలు వడ్డించాలన్నారు.

ర్యాలీ జయప్రదం చేయండి

హిందూపురం టౌన్: పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలను ఏర్పాటు చేయాలని కోరుతూ జనవరి 6న పట్టణంలో తలపెట్టిన ర్యాలీను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబావలి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డిలు సమావేశమై మాట్లాడారు.

రూ. 7 వేలతో కంది కొనుగోలు

పెనుకొండ: రైతులు పండించిన కంది విత్తనాన్ని క్వింటా రూ.7 వేలతో ప్రభుత్వమే కొనుగోలు చేయడం జరుగుతుందని సివిల్ సప్లయ్స్ డీఎం అశ్వర్థనారాయణనాయక్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ సమావేశపు భవనంలో వ్యవసాయశాఖ సిబ్బంది, సివిల్ సప్లయ్స్ సిబ్బందితో జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుబ్బారావు నేతృత్వంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. డీఎం మాట్లాడుతూ రైతులు దళారులతో మోసపోకూడదన్న ఆలోచనతో ప్రభుత్వం రైతులు పండించిన కందిని రూ.7 వేల మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. రైతులు ఆర్‌బీకేలు, వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలన్నారు. ఏడీ స్వయంప్రభ, ఏఓ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పరికరాల పంపిణీ

అమరాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ మునిస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం దివ్యాంగులకు పరికరాలను పంపిణీ చేశారు. రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ వీరక్యాతరాయప్ప, ఎంపీటీసీ నారాయణ, కెంచప్ప చేతుల మీదుగా పరికరాలు అందజేశారు. ఇంకా ఎవరికైనా పరికరాలు కావాల్సి ఉంటే ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు.

శబరిమలకు పాదయాత్ర


ఇరుముడి కట్టుకున్న అయ్యప్పస్వాములు

పావగడ: కరోనా మహమ్మారి పూర్తిగా తొలగిపోయి దేశ ప్రజలు ఆరోగ్య వంతులుగా ఉండాలని కోరుతూ స్థానిక అయ్యప్ప మాలధారులు కాలినడకన శబరిమలకు బయలుదేరారు. ముందుగా అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేసి ఇరుముడి అనంతరం యాత్ర ప్రారంభించారు.

భక్తిశ్రద్ధలతో మండల పూజ

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురంలో అయ్యప్పస్వామి మండల పూజ కార్యక్రమాన్ని అయ్యప్ప మాలధారులు ఘనంగా నిర్వహించారు. స్వామి వారి చిత్రపటాన్ని ప్రత్యేక వాహనంలో ఉంచి ఊరేగించారు.

నేడు కౌన్సిల్ అత్యవసర సమావేశం

పెనుకొండ: పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు పాలక వర్గ అత్యవసర సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ వంశీకృష్ణభార్గవ్ తెలిపారు. చైర్‌పర్సన్ ఉమర్ ఫారూక్‌ఖాన్ ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి సభ్యులు తప్పక హాజరుకావాలని కోరారు.

ఎయిర్‌పోర్టుకు వాల్మీకి పేరు పెట్టడం హర్షణీయం

హిందూపురం టౌన్: అయోధ్యలో ఎయిర్‌పోర్ట్‌కు వాల్మీకి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌గా నామకరణం చేయడంపై వాల్మీకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక వాల్మీకి సేవా సంఘంలో కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. సమావేశంలో వాల్మీకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తాత్కాలిక హుండీ కానుకల లెక్కింపు

మడకశిరరూరల్: మండల పరిధిలోని భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి , జిల్లెడుగుంట అంజినేయ స్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఆలయాల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీ కానుకలను శుక్రవారం లెక్కించారు. ఆంజనేయస్వామి ఆలయంలో రూ.2,35,590, లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో రూ.1,80,415 లక్షల చొప్పున మొత్తం రూ.4,16,005 ఆదాయం వచ్చిందని ఈఓ నాగేంద్రప్రసాద్‌రావు తెలిపారు.